## క్లుప్తంగా

### 78 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు



దాచేపల్లి : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దాచేపల్లి నగర పంచాయతీలో 37, గ్రామాల్లో 41 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం 390 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తారని, ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్ పి. గీతావాణీ చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సీఐ ఎ.సురేంద్రబాబు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

### బాధితులకు పరామర్శ



గురజాల : రెంటచింతల గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి పరామర్శించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వారిని పరామర్శించి, గొడవకు గల కారణాలను తెలుసుకున్నారు. వైద్యులను బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశా రు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వై ద్యం కొరకు నరసరావుపేటకు తరలించారు.

### బైక్ నుంచి పడి వ్యక్తి మృతి



దాచేపల్లి : ద్విచక్ర వాహనం జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. మృతుడు గురజాల మండలం బుధవాడ గ్రామానికి చెందిన దాసరి బ్రహ్మయ్య(32)గా గుర్తించారు. ఎస్ఐ జి.సంధ్యారాణి వివరాల మేరకు.. గురజాలలో నివాసం ఉంటున్న బ్రహ్మయ్య ఓ పార్టీ ప్రచార కార్యక్రమం నిమిత్తం స్వగ్రామమైన బుధవాడకి వచ్చాడు. ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్తుతున్న క్రమంలో నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలోని ద్విచక్రవాహనంపై నుంచి జారి పక్కనే ఉన్న క్వారీ గుంతల్లో పడ్డాడు. బలమైన గాయాలు కావటంతో బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం మృతదేహాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నారు.

# నేడే పోలింగ్.. సర్వం సిద్ధం

- సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం
- పోలింగ్ స్టేషన్లకు చేరిన ఈవీఎంలు
- ఉదయం 7 గంటల నుంచి ఎన్నికలు ప్రారంభం



ఎన్నికల సామగ్రిని తీసుకుని బయలుదేరిన సిబ్బంది

గురజాల : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు గురజాల నియోజకవర్గంలో అధికారులు సర్వ సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీవీ రమణాకాంత్‌రెడ్డి ఆదివారం సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. వారికి ఎన్నికల సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నామని తెలిపారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 304 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయా రూట్లలో ఏర్పాటు చేసిన వాహనాల్లో పోలింగ్ అధికారులు, సిబ్బంది పోలింగ్ స్టేషన్లకు తరలివెళ్లారు. రవాణాకు సంబంధించి మొత్తం 54 బస్సులు వినియోగించారు. ఎన్నికలకు సుమారుగా 3,100 మందికి పైగా విధుల్లో పాల్గొనటం జరుగుతుందని ఆర్వో తెలిపారు.

**ఉదయం 7గంటల నుంచి ప్రారంభం**

గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల పరిధిలో ఉన్న 304 పోలింగ్ బూత్‌ల్లో ఉదయం 7గంటల నుంచి పోలింగ్ జరగనుంది. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అదే విధంగా వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేంద్రాల వద్ద ర్యాంప్‌లు, వీల్‌చైర్స్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆర్వో తెలిపారు.

**ప్రశాంత ఎన్నికలే లక్ష్యం..**

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణం జరగడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ పల్లపురాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలివెళ్తున్న తరుణంలో పోలీస్ సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోనే విధంగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మకంగా గుర్తించిందని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికలకు ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీలు ఇద్దరు, డీఎస్పీలు ఐదుగురు, సీఐలు ఐదుగురు మిగిలిన సిబ్బంది 835 మంది విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



సామగ్రి తీసుకుని పరిశీలిస్తున్న సిబ్బంది



పోలింగ్ సామగ్రిని తీసుకుని సరిచూసుకుంటున్న సిబ్బంది



సామగ్రిని అందిస్తున్న సిబ్బంది

## పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన



మంచికల్లు పోలింగ్‌బూత్ బారికేడ్లను పరిశీలిస్తున్న మండల ఎన్నికల అధికారి శంకర్‌రావు

రెంటచింతల: మండలంలోని 50 పోలింగ్ కేంద్రాల్లో సర్వం సిద్ధమైనట్లు ఎంపీడీవో, నోడల్ ఆఫీసర్ మోడల్ కోడ్ కండక్ట్ పెదప్రోలు శంకర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా, విద్యుత్ ప్లగ్‌లు ఉన్నాయా లేవా, సరిపడ వెలుతురు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల సౌకర్యం, వృద్ధులకు ఏర్పాటు చేసిన ర్యాంప్‌లను పరిశీలించారు. మండుతున్న ఎండల కారణంగా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 144 సెక్షన్ అమలు

పిడుగురాళ్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పట్టణం, గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ప్రజలందరూ గుంపులుగా ఉండకూడదని, అత్యవసరమైతేనే వీధుల్లోకి రావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని సూచించారు. పోలీస్ విధులకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల నియామవళి ఉల్లఘించిన వారిపై కఠిన కేసులు విధించటం జరుగుతుందని తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు సిద్ధం



వెల్దుర్తి జెడ్పీ హెచ్ఎస్‌లో పోలింగ్ కేంద్రం

వెల్దుర్తి: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ నరసింహ ఆదివారం తెలిపారు. మండలంలో 49 పోలింగ్ బూత్‌ల్లో అన్ని వసతులు కల్పించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. బూత్‌ల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. టెంట్లు, బారికేడ్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు సిబ్బంది, ఓటర్లకు మంచినీటి సౌకర్యం ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారు ఓటు గుర్తు స్లిప్పుతో పాటు గుర్తింపు కార్డు ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్టు ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులను ఒరిజినల్ వెంట తెచ్చుకోవాలన్నారు.

## కేసానుపల్లి వాసికి డాక్టరేట్




దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లికి చెందిన దుగ్గరాజు కేశవరావు కుమారుడు రంగనాథ్‌కి డాక్టరేట్ ప్రదానం చేశారు. జ్యోతిష్యంలో విశిష్ట సేవలను హైదరాబాద్‌లోని పరశర అకాడమి ఆఫ్ అస్ట్రో సైన్స్ డాక్టరేట్‌ని ప్రకటించారు. అక్కడ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రామ్‌ప్రసాద్ చేతుల మీదుగా రంగనాథ్ డాక్టరేట్ అందుకున్నాడు. స్థానికులు దుగ్గరాజు హనుమంతరావు, దుగ్గరాజు కృష్ణమూర్తి, ప్రసాద్, నాగేశ్వరరావు, హనుమంతరావు అభినందించారు.

## అన్ని పోలింగ్ కేంద్రాలకు విద్యుత్తు సౌకర్యం

ఈఈ హరిబాబు



విద్యుత్తు సిబ్బందికి సూచనలిస్తున్న ఈఈ హరిబాబు

కారెంపూడి: మండలంలోని పోలింగ్ కేంద్రాలకు కల్పించిన విద్యుత్తు సౌకర్యాలను విద్యుత్తు శాఖ మాచర్ల ఈఈ హరిబాబు ఆదివారం తనిఖీ చేశారు. స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించడం జరిగిందని ఈఈ తెలిపారు. ఎక్కడైనా అంతరాయం కలిగితే తక్షణమే పరిష్కరించేందుకు కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఏమైనా ఇబ్బందులుంటే 9440 817531 మొబైల్ నంబరుకు సంప్రదించాలని కోరారు. మాచర్ల సర్కిల్ పరిధిలోని మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఏఈ కె.కోటేశ్వరరావు, లైన్‌మెన్ పాపారావు ఉన్నారు.

## బాధ్యత కలిగిన పౌరులుగా సహకరించండి



కారెంపూడి సీఐ నారాయణస్వామి

రెంటచింతల: ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యత కల్గిన పౌరులుగా సహకరించాలని కారెంపూడి సీఐ నారాయణస్వామి కోరారు. ఆదివారం మండలంలోని రెంటచింతల, మిట్టగుడిపాడు, రెంటాల, తుమృకోట తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మకమైన గ్రామాలపైన ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎన్నికల విధులకు ఆటంకం కలిగించే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటు వేయమని ఎవరైన ఇబ్బంది పెట్టినా.. దౌర్జన్యం చేసిన... దాడి చేసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రతి దాడులకు దిగవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన సి–విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని కోరారు. ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి తదితరులున్నారు.

## మాచర్లలో పోలింగ్‌కు అంతా సిద్ధం

- నియోజకవర్గంలో 299 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- ఆర్వో ఎ.శ్యాంప్రసాద్



పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆర్ఓ శ్యాంప్రసాద్





మున్సిపల్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల పరిశీలనకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూం

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఈవీఎంలను ప్రజలు ఓట్లు వేసేందుకు అన్ని సిద్ధం చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నందు ఉద్యోగులతో కలిసి 299 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఇప్పటికే వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించి, పీఓ, ఏపీఓ, ఓపీఓ తదితరులకు ఎన్నికల సామగ్రిని అందించారు. పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక బస్సుల్లో ఆయా మండలాల్లోని గ్రామాలకు పంపిణీ చేశారు. తెల్లవారు జామున 5గంటల నుంచే సిబ్బంది కేంద్రంలో అందుబాటులో ఉండి 5.30గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి 6గంటల కల్లా ఓటింగ్‌ను ప్రారంభించాలని తగు సూచనలందించారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిన్న ఘటన జరిగినా వెంటనే ఆయుధాలతో కూడిన సిబ్బంది కేంద్రానికి చేరుకొని పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తెచ్చాల ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రాలు నిర్దేశించిన పరిధిలో రాజకీయ పార్టీలకు చెందిన ఆందోళనలు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని కోరారు.

**పెరిగిన ఓటర్లు..**

మాచర్ల: నియోజకవర్గంలోని ఐదు మండలాలు, పట్టణంలో 2.60లక్షలు మందికి పైగా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోనున్నారు. పురుషులు 1.28లక్షలు, స్త్రీలు 1.33లక్షలు, ఇతరులు 48 మంది ఉన్నారు. నియోజకవర్గంలో గతం కన్నా 10వేల మంది ఓటర్లు పెరిగారు. 542 పీఓలు, 858 అసిస్టెంట్ పీఓలతో పాటు మరో 2 వేల మంది సిబ్బందిని ఎన్నికల విధులకు సిద్ధం చేశారు. అనేక సమస్యాత్మక గ్రామాలను గుర్తించిన రెవెన్యూ, పోలీసు అధికారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎక్కడ చూసినా పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బంది లేకుండా మంచి నీరు, మౌలిక వసతులు ఏర్పాటు చేశారు.

# చేతల్లో పనులు.. కళ్ల ముందు సాక్ష్యాలు

- గతంలో గురజాల చూడని అభివృద్ధి
- సుమారు రూ. 821.36 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం
- బైపాస్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి
- పట్టణంలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం
- పట్టణ సమీపంలో 600 పడకలతో వైద్య, కళాశాల నిర్మాణం



పిడుగురాళ్ల పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ భవనం

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లైమ్ సిటీగా పిలవబడే పిడుగురాళ్ల పట్టణంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తనదైన మార్కు చూపించారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇంతటి అభివృద్ధి ఏ ప్రభుత్వంలో జరగలేదని పట్టణ ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. అభివృద్ధికి కేరాఫ్‌గా ఆదర్శంగా పిడుగురాళ్ల పట్టణం మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి పిడుగురాళ్ల పట్టణ సమీపంలో 600 పడకల వైద్యశాల, కళాశాలను మంజూరు చేయించి ఫస్ట్ ఫేజ్‌లో 100 పడకల హాస్పటల్ భవనాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో హాస్పటల్ నిర్మాణం పూర్తి అయి పల్నాడు ప్రాంత పేద ప్రజలకు వైద్యం అందించేందుకు సిద్ధమవుతోంది. పల్నాడు ప్రాంతానికి వైద్యశాల, కళాశాల మణిహారంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వంలో కనీసం పట్టణ ప్రజలకు కనీసం గుక్కెడు తాగు నీరు కుడా అందించలేకపోయారు. ఒక్క ఇంటి పట్టా ఇవ్వలేదు, కనీసం పేదల కోసం ఒక్క హాస్పటల్ కుడా నిర్మించలేకపోయారు.



పట్టణంలో నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రం



పూర్తయిన బైపాస్ రోడ్డు

**పరుగులు పెట్టిన సంక్షేమం..**

పట్టణంలోని 33 వార్డుల్లోని 17 సచివాలయాలు ఏర్పాటుచేసి ప్రజలవద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిచారు. సచివాలయ వ్యవస్థ ప్రజల చెంతకు తెచ్చి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అందించింది. ప్రభుత్వ పథకాలతో ప్రజలకు రూ. 330.22కోట్లు ప్రజల ఖాతాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వేశారు.

**అభివృద్ధి పరుగులు ఇలా...**

- నాడు, నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 9.88 కోట్లు.
- తాగు నీటి కనెక్షన్లు 10,724 అందిచారు. వీటికోసం రూ. 22.3 కోట్లు.
- 7,132 మందికి సుమారు రూ. 106.98 కోట్లు విలువ చేసే ఇళ్ల స్థలాలిచ్చారు.
- సీసీ రోడ్లు, సైడ్‌కాల్వలు, బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ. 110.96 కోట్లు వెచ్చించారు.
- హాస్పటల్స్ నిర్మాణ కోసం రూ. 172 కోట్లు ఖర్చు చేశారు.
- నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణానికి రూ. 2 కోట్లు వెచ్చించారు.
- చెరువు అభివృద్ధికి రూ.11 కోట్లు, పిడుగురాళ్ల బైపాస్ నిర్మాణానికి రూ. 82 కోట్లు నిధులిచ్చారు.
- పిడుగురాళ్ల పట్టణంలోని అబ్దుల్ కలాం ఆటో నగర్ నిర్మాణానికి రూ. 3 కోట్లు, రైల్వే స్టేషన్ ఆధునీకరణకు రూ. 19 కోట్లు, చెరువు వద్ద పార్కు నిర్మాణానికి రూ. 13 కోట్లు, జానపాడు రోడ్డు రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 52 కోట్లు నిధులు మంజూరు చేయించటం జరిగింది. మొత్తం అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.491.14 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో లైమ్ సిటీ అభివృద్ధిలో ముందంజలో ఉందని ప్రజలు చెప్తున్నారు.



డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



రూపురేఖలు మారిన మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల




నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయం



విశాలంగా పిడుగురాళ్ల రోడ్డు ఏరియల్ వ్యూ

## ముదిరాజుల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ కృషి



చైర్మన్ కొర్నె నారాయణ ముదిరాజ్, ముదిరాజ్ సంఘ నాయకులు

మాచర్ల రూరల్: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బీసీలకు వెన్నుదన్నుగా నిలిచి ముఖ్యంగా ముదిరాజుల ఆర్థిక, రాజకీయాభివృద్ధికి కృషి చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముదిరాజుల మద్దతు ఉంటుందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్నె నారాయణ ముదిరాజ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏపీలో మొట్టమొదటగా ముదిరాజులను గుర్తించిన పార్టీ వైఎస్సార్ సీపీనేనని చెప్పారు. ముదిరాజుల ఆడపడుచు విడుదల రజనికి చిలకలూరి పేట ఎమ్మెల్యేగా గెలిపించి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు అప్పజెప్పారని తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటగా ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను ఏర్పాటు చేసి ముదిరాజుల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఎంతగానో సహకరించారన్నారు. 20లక్షలకు పైగా ఉన్న ముదిరాజులను బీసీ (ఎ)లో చేర్చాలని సీఎం వైఎస్ జగన్‌కు విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు. సుప్రీం కోర్టులో ఉన్న బీసీ(ఎ) జాబితా విషయం పై ప్రత్యేక చొరవ చూపిస్తానని హామినిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అంకితభావానికి స్ఫూర్తి.. మదర్ థెరిసా

సత్తెనపల్లి: సేవ అంకితభావం కలిగిన నర్సులకు మదర్ థెరీసా స్ఫూర్తి ప్రదాత అని వేద నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మామిడి మాలతీ అన్నారు. జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కేక్ కట్ చేసి విద్యార్థినిలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని తమ వారిగా భావించి సేవలందించే నర్సుల ఔన్నత్యం ఎనలేనిదన్నారు. కార్యక్రమం లో మహిళ అకాడమిక్ డైరెక్టర్ చింతాడ లలితా సృజన, కళాశాల అధ్యాపకులు అనూష, ప్రియా పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమంలో అన్నసంతర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ అనాధ వృద్ధాశ్రమంలో వ్యాపారవేత్త పుసులూరి చిన్నికృష్ణ అన్న సంతర్పణ చేపట్టారు. తన కుమారుడు వరుణ తేజ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం భోజనాలు పెట్టారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు కె.ఇంద్రసేన, కె.రిషితలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పుసులూరి.శివప్రసాద్ ఉన్నారు.